

# వెఱ్ఱిబాగులపిల్ల

• ఎం. రామకృష్ణరావు •

"ఏంరా, నీ భార్య నీ చెప్పుచేతల్లో ఉంటుందా లేక మారాం చేసే ఘటమా" ఈ ప్రశ్నకి ఎలా జవాబు చెప్పాలో రామంకి అర్థం కాలేదు. తన భార్యగురించి తెలిసే ఇలా అడుగుతున్నాడా, తెలవక అడుగుతున్నాడా అన్న సందేహంతో కొంతసేపు మౌనంగా ఊరుకున్నాడు. తనకి కొత్తగా పెళ్ళయిందిగాబట్టి, తన భార్యగురించి కాస్త తెలుసుకుందామన్న అభిప్రాయంతో అడిగి వుంటాడని రామం నిర్ధారణ చేసుకున్నాడు. ప్రకాశం చిన్నప్పటి స్నేహితుడు గాబట్టి, అటువంటి ప్రశ్న వేయడంలో ఏమాత్రం తప్పు కన పడలేదు రామంకి.

"ఆ ఉండకేంజేస్తుందేం, పట్నవాసపు పిల్లయినా మన అదమాయింపులకి లొంగి ఉండాల్సిందే. మనదగ్గర...ఏవిటి . మనదగ్గర వెఱ్ఱి వేషాలు పనికిరావురా భాయ్ ఎలా చెప్తే అలా వినాల్సిందే. ఈ కాలంలో ఆడదాన్ని చెప్పుచేతలో వుంచుకోకపోతే లాభంలేదురో వెఱ్ఱిబాగుల పిల్లరా పాపం, హూల్ అంటె అదిరిపోతుంది."

ఏదో రెండు ముక్కల్తో తెంపవలసిన విషయంగురించి పావుగంట లెక్చరుకొట్టాడు రామం. ప్రకాశం కొంచెం విసుక్కున్నాడనే చెప్పాలి. అయినా శ్రద్ధగా విన్నాడు

"ఈ మలుపు తిరగగానే మీ యిల్లనుకుంటా కాస్త మంచినీళ్ళిప్పించరా."

మంచినీళ్ళిప్పించడమనేది పెద్ద సమస్యగా తోచింది రామంకి. సాధారణంగా రామం తన ఇంటికి ఎవరినీ ఆహ్వానించడు. ఆ ప్తమిత్రుడు నోరార మంచినీళ్ళడుగుతుంటే ఎలా కాదనగలడు.

తలుపువేసుంది. రామం తలుపు కొట్టాడు ఎవరూ పలుకలేదు.

"రత్నం. రత్నం"

"ఇదిగో తలుపు తియ్యి" తలుపు మరోమారు కొట్టాడు.

"మీకు వేళాపాళా లేదూ. చీట్లపేక ఆడిఆడి రావడం. ఏ పదింటికో ఇంటికి చేరుకోవడం మీకోసం కనిపెట్టుకూర్చోవాలేం "

రామం బిక్కమొగంవేసి నిలబడ్డాడు తలుపు తెరవలేదు.

"తలుపు తియ్యమంటే."

"ఒకమారు చెప్తే తెలిసికోవాలా. నేనేం మనిషి ననుకున్నారా, మానసుకున్నారా! దొడ్డి త్రోవనిరండి."

అనవసరపు ఘర్షణపెట్టుకుంటే పరువుపోతుందనుకున్నాడు "ఇదిగో స్నేహితుడొచ్చాడు వేగిరం తియ్యి."

తలుపు దభామని తెరిచింది.

"సిగ్గులేక అబద్ధాలుకూడానా. ఏడీ స్నేహితుడు."

రామం వెనక్కి తిరిగి చూశాడు. ప్రకాశం ఎప్పుడు వుడాయించాడో మరి కానరాలేదు. "అనుకున్నంతా చేశావురా దేవుడా" అనుకుంటూ రామం తలవంచుకొని లోపలికి వెళ్ళిపోయాడు.